"ఎవరు చెప్పారు?"

"అతడూ, ఆవిడా తప్ప ఇంకెవరున్నారండీ ఆ ఇంట్లో? ఆవిడే చెప్పింది".

వజ్రపాణి ఉలిక్కిపడి లేచి నిటారుగా కూచుంటూ "ఏమిట్రా నారిగా! ఈ మధ్య వీడేమైనా కథ నడిపించాడేమిటి? ఆవిడా, గీవిడా అంటున్నావు?" అన్నాడు.

ఆ ప్రాంతంలో అందరికీ సుపరిచితమైన రంగడి ప్రణయగాథ ఇంతవరకూ అయ్యగారి చెవులదాకా వెళ్ళనందుకు నారిగాడు విస్తుపోయాడు. ఎంతగా నాగరికత ముదిరిపోయినా ఇప్పటికీ అక్కడక్కడా తోటరాముడిలాంటి వ్యక్తి రాకుమారి లాంటి జగదేక సుందరిని వలచీ వలపించుకోగలదనడానికి రంగడి ప్రణయగాథ చక్కని తార్కాణం. రంగడు వజ్రపాణి మామిడితోటకు కొద్దిరోజుల పాటు కాపుదారీ నిర్వహించాడు కూడా! వాడి హయాంలో ఆ తోపు వాడికీ, వాడి నేస్తాలకూ క్రీడా స్థలంగా ఉపకరించింది. రంగడు భాగ్యవంతుడుగా పుట్టలేదు గానీ, ఉన్నంతలో మాత్రం వాడిది ఎముకలేని చేయి! కంచెకావల నిలబడి 'బాబూ! ఒక మామిడి కాయ ఇలా పడేస్తారు!' అని అడగని వాళ్ళది పాపం గాని, చిరాకు, కోపం, అహంభావం ఇలాంటి వేవీ లేకుండా కాయల్ని తీసి గిరవాటు వేయడానికి రంగడు సర్వదా సంసిద్ధుడు. అందువల్ల వాడి నిర్వాకంలో మామిడి తోపుకు కీర్తి ప్రతిష్టలు హెచ్చి, వజ్రపాణికి ఆదాయం సన్నగిల్లసాగింది.

తోటకాపరితనం కాస్తా ఊడిపోయిన తర్వాత రంగడు నూలులేని గాలిపటంలా కొంతకాలం దేశమంతా చెడతిరిగాడు. ఎలా తిరిగినా కవళం తిరిగి తిరిగీ నోటి దగ్గరికే రావలసినట్టు రంగడు మళ్ళీ మళ్ళీ స్వంత ఊరికే తిరిగి రావలసి వచ్చేది. జననీ, జన్మభూమి స్వర్గం కన్నా ఎక్కువన్నారు మరి! రంగడికి జనని లేదు, జనకుడూ లేదు. జన్మభూమి మాత్రం ఉంది.

ఒకసారి రంగడు ఎంతదూరం వెళ్ళాడో, ఏం చేశాడో గానీ వెళ్ళిన మూడు నెలలకు తిరిగి వచ్చాడు. వస్తూ వస్తూ వాడొక పిల్లనగ్రోవి తీసుకొచ్చాడు. దానిపైన వాడు చేసిన సాధన చుట్టుప్రక్కల వాళ్లకందరికీ రిచ్చపాటు కలిగించింది. రాత్రి భోజనమైన తర్వాత భజనగుడి ముందు రచ్చపైన నందీశ్వరుడి కానుకని కూచున్నాడంటే వాడి వేణుగానం మెల్లమెల్లగా అలలు అలలుగా సాగి, పరిసర వాతావరణాన్ని మత్తుతో నింపివేసేది. ఊదుతూ, ఊదుతూ అలాగే నేలపైకొరిగి పిల్లనగ్రోవిని చేతిలో ఉంచుకునే రంగడు నిద్రపోయేవాడు.

ఊళ్ళో మాత్రం రంగడెంతటి నిరాదరణకు పాత్రుడయ్యాడో, వాడి వేణుగానమూ అంత నిర్లక్ష్యానికి పాత్రమైంది. ఒకరి మెరమెచ్చుల కోసం ప్రారంభించిన కృషి కాకపోవడం చేత రంగడు అందువల్ల నిరుత్సాహపడడం సంభవించలేదు జోలపాటలా ఉండవలసిన వేణుగానం రచ్చకు దాపున కాపురమున్న వాళ్లకి నిద్రాభంగ హేతువుగా పరిణమిస్తోందని తెలిసినప్పుడు కూడా రంగడు ఖేదపడలేదు. తను వాళ్ళకి అయిష్టుడు. తనపట్ల వారికున్న కూరిమి కొద్దిపాటిది. ఆ కూరిమి తను వాళ్ళకి చాకిరీ చేసినంతవరకు మాత్రమే ఉండి, తరువాత రంగంపైనుంచి తెర వెనుకకు వెళ్ళిపోయే నాటక పాత్రలా మాయమౌతుంది. ఆపైన తను చేసిన ప్రతిపనీ వాళ్ళ అవహేళనకీ, అసహ్యతకీ గురౌతుంది. అందుకు చింతించి లాభం లేదు.

లేమి చేత బాధపడుతూ అష్టకష్టాలు ఎదుర్కోవలసిన మనిషి కూడా తన జీవితంలో ఎక్కడో ఒకచోట టర్నింగ్ పాయింట్ ఉంటుందనీ, ఆపైన తనకోసం నవజీవనానందం

